క్లుప్తంగా

బాల్యవివాహాలతో అనర్థాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

మానకొండూర్‌రూరల్: మండలంలోని పచ్చునూర్‌లో ఓ మైనర్ బాలికకు ఆదివారం వివాహం జరిపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారనే విషయం తెలుసుకున్న తహసీల్దార్, ఐసీడీఎస్ అధికారులు గురువారం గ్రామానికి చేరుకున్నారు. తల్లిదండ్రులకు బాల్యవివాహాలతో జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మారెడ్డి, ఐసీడీఎస్ డీసీపీవో శాంత, ఆర్ఐ సత్యనారాయణ, చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది, ఏఎస్సై భాస్కరాచారి, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

15 నుంచి సీఎం కప్ మండలస్థాయి క్రీడాపోటీలు

గంగాధర: మండలస్థాయి సీఎం కప్ క్రీడాపోటీలను 15 నుంచి 17 వరకు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో రాజీవ్ మల్హోత్రా పేర్కొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్‌లో రాణించిన క్రీడాకారులను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించే పోటీలకు అందరూ సహకరించాలన్నారు. గ్రామాల్లోని క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

మహిళ ప్రాణాలు కాపాడిన పోలీసులకు రివార్డులు


రివార్డు అందజేస్తున్న ఏసీపీ వెంకట్‌రెడ్డి

జమ్మికుంట: సమయస్ఫూర్తితో మహిళ ప్రాణాలు కాపాడిన పోలీసులకు హుజూరాబాద్ ఏసీపీ కోట్ల వెంకట్‌రెడ్డి రివార్డు(నగదు) అందజేశారు. గురువారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల మండలంలోని బిజిగిరిషరీఫ్ గ్రామానికి చెందిన వివాహిత పుప్పాల శ్రీలత కుటుంబ కలహాలతో రైలు పట్టాల మీద కూర్చొని ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. స్థానికుల సమాచారంతో బ్లూకోల్ట్స్ సిబ్బంది, హోంగార్డులు ఆమె ప్రాణాలు కాపాడారు. సీపీ సుబ్బారాయుడు సూచనల మేరకు పోలీసులకు నగదు అందజేశామన్నారు. క్షణికావేశంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని, ఆత్మహత్యలతో కుటుంబాలు చిన్నాభిన్నమవుతాయన్నారు. అనంతరం పోలీసులను అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఐ యూనిస్ అహ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్ గ్రామానికి చెందిన గీత కార్మికుడు పంజాల రామ్‌గోపాల్ గురువారం తాటిచెట్టు పైనుంచి పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. తోటి కార్మికులు 108 వాహనంలో హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి...

శంకరపట్నం: మండలంలో గురువారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలయ్యాయని కేశవపట్నం ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. వెంకటేశ్వర్లపల్లెలో రెండు బైకులు ఢీకొనడంతో హుజూరాబాద్‌కు చెందిన గొస్కుల శృతి, కేశవపట్నంలో కారు ఢీకొనడంతో చింతలపల్లికి చెందిన చింతిరెడ్డి రాజిరెడ్డికి గాయాలయ్యాయన్నారు. బాధితులను ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

చికిత్సపొందుతూ వృద్ధుడు మృతి

కరీంనగర్‌రూరల్: వృద్ధాప్యంతో పాటు అనారోగ్య సమస్యలతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతున్న అనగోని మల్లయ్య(92) గురువారం మృతి చెందాడు. ఆరెపల్లికి చెందిన అనగోని మల్లయ్య కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బుధవారం ఇంట్లో గడ్డి మందు తాగి పడిపోగా కుటుంబసభ్యులు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం మధ్నాహ్నం మృతిచెందాడు. కొడుకు పర్శరాములు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

వచ్చిన నిధులు వాపస్..

- గ్రామాల అభివృద్ధికి రూ.కోట్లు మంజూరు
- సద్వినియోగం చేసుకోలేకపోతున్న స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు
- పనులు చేపట్టకపోవడంతో వెనక్కి
- మౌలిక వసతులకు నోచుకోని పల్లెలు


అభివృద్ధికి నోచుకోని గర్రెపల్లి రోడ్డు

సైదాపూర్: గ్రామాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు ప్రవేశపెడుతున్నా క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి పదేళ్లు కావస్తున్నా ఇప్పటికీ కొన్ని గ్రామాలు కనీస మౌలిక వసతులకు నోచుకోవడం లేదు. మండలంలోని సోమారం గ్రామ పంచాయతీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. పంచాయతీ పరిధిలో సోమారం, బూడిదపల్లి, గర్రెపల్లి, పసికెపల్లి గ్రామాలున్నాయి. దశాబ్ద కాలంగా గ్రామాభివృద్ధికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరవుతున్నాయి. కానీ స్థానిక పాలకులు నిధులను సద్వినియోగం చేసుకోకపోవడంతో వాపస్ వెళ్తున్నాయి. గతంలో సీసీరోడ్లు, పైపులైన్ల మరమ్మతులకు మంజూరైన నిధులు వెనక్కి వెళ్లగా ప్రస్తుతం గ్రామాభివృద్ధికి రూ.2.60 కోట్ల నిధులు మంజూరయ్యాయి. అయినా పనులు మాత్రం చేపట్టడంలేదు. నిధులు మళ్లీ వాపస్ వెళ్లే అవకావం ఉందని సంబంధిత అధికారులు పేర్కొటున్నారు. ఆయా గ్రామాల్లోని నాయకుల ఆధిపత్యం, తీరువల్లనే అభివృద్ధి పనులు జరగడం లేదని గ్రామస్తుల నుంచి విమర్శలు వెలువడుతున్నాయి.

సమస్యలు

- సోమారం గ్రామ పంచాయతీ పరిధిలోని మూడు హామ్లేట్ గ్రామాలు బూడిదపల్లి,గర్రెపల్లి,పసికపల్లి.
- ఈ గ్రామాలకు సీసీరోడ్లు, మురుగుకాలువలు, రోడ్డు మార్గాలు లేవు. పసికపల్లి నుంచి గ్రామ పంచాయతీకి రావడానికి రోడ్డే లేదు. కిలోమీటర్ దూరంలో ఉన్న పల్లె జనం ఏడు కిలోమీటర్ల దూరం నుంచి రావాల్సి వస్తోంది.
- బూడిదపల్లిలో సీసీ రోడ్లు,డ్రైనేజీ లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు.
- గర్రెపల్లిలో ఎన్నో సమస్యలున్నాయి. డ్రైనేజీ, సీసీ రోడ్లు లేక వరదనీరు ఇళ్లలోకి వస్తోంది. కనీసం రోడ్డు మార్గం సరిగా లేదు. గర్రెపల్లి నుంచి సోమారం 1.50 కిలోమీటర్ల దూరం, గర్రెపల్లి నుంచి సైదాపూర్ ఆర్అండ్‌బీ రోడ్డు వరకు 2 కిలోమీటర్ల దూరం మట్టిరోడ్డే దిక్కు. గ్రామానికి కనీసం రోడ్డు సౌకర్యం కల్పించాలని మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే చుట్టూ గ్రామస్తులు ఏళ్లగా తిరుగుతూ మొరపెట్టుకుంటున్నారు. ఎట్టకేలకు తారురోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు మాత్రం చేపట్టడం లేదు.
- గ్రామ పంచాయతీలో అధికార పార్టీ నాయకుల తప్పిదం వల్లనే అభివృద్ధి జరగడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.
- గతంలో బూడిదపల్లి, సోమారం గ్రామాల్లో సీసీరోడ్లకు రూ.10 లక్షలు, సోమారం నుంచి గర్రెపల్లికి పైపులైన్ పనులకు రూ.2 లక్షలు మంజూరు కాగా పనులు చేయకపోవడంతో నిధులు వాపస్ వెళ్లినట్లు సమాచారం.
- ఈ ఏడాది గ్రామ పంచాయతీ పరిధిలోని గర్రెపల్లికి సీసీరోడ్లకు రూ.20 లక్షలు, సోమారం నుంచి గర్రెపల్లి నుంచి సైదాపూర్ ఆర్అండ్‌బీ రోడ్డు వరకు మూడు కిలోమీటర్ల తారురోడ్డు నిర్మాణానికి రూ.2.40 కోట్లు మంజూరైనప్పటికీ పనులు చేపట్టడంలేదు. గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక వర్షాకాలంలో గ్రామస్తులు నరకం అనుభవిస్తున్నారు. ఎమ్మెల్యే, నాయకులు, సంబంధిత అధికారులు దృష్టి సారించి మంజూరైన పనులను చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అభివృద్ధికి పాటుపడాలి



వివిధ అభివృద్ధి పనులు చేయకపోవడంతో మంజూరైన నిధులు వాపస్ పోతున్నాయి. గ్రామం పదేళ్లుగా అభివృద్ధికి నోచుకోవడం లేదు. నిధులు మంజూరు చేయించి గ్రామ అభివృద్ధికి పాటుపడాల్సిన నాయకులు మంజూరైన పనులు చేయించడం లేదు.

– పిట్టల సారయ్య, మాజీ వార్డు సభ్యుడు

తారురోడ్డు నిర్మించాలి



గర్రెపల్లి నుంచి సోమారం కిలోమీటర్, గర్రెపల్లి నుంచి సైదాపూర్ రెండు కిలోమీటర్ల మేర తారురోడ్డు ని ర్మాణానికి ఎమ్మెల్యే కృషితో నిధులు మంజూరు కావడం హర్షనీయం. ఎమ్మెల్యే, ఉన్నత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి గర్రెపల్లికి తారురోడ్డు నిర్మించాలి.

– తిప్పిరి శెట్టి మహేశ్, గర్రెపల్లి

విద్యార్థులకు సన్మానం, అభినందనలు


రామడుగు: విద్యార్థులను సన్మానిస్తున్న నాయకులు


తేజస్వినిని సన్మానిస్తున్న సురేందర్‌రెడ్డి

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామ ఐక్యత యూత్ మాల సంఘం ఆధ్వర్యంలో టెన్త్, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన ముచ్చె రక్షిత, కాడె రిషితను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాడె శంకర్, మాల సంఘం అధ్యక్షుడు ఎట్టెం కనకయ్య, ఐక్యత యూత్ మాల సంఘం అధ్యక్షుడు కాడె కనకయ్య, నాయకులు కాడె ప్రభాకర్, మోహన్, రాయమల్లు, సుధీర్, శ్రావణ్, పోచయ్య, నాగరాజు పలువురు పాల్గొన్నారు.

వీణవంక: మండలంలోని చల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పది ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం చంద్రకళ విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయుల సమష్టి కృషి, విద్యార్థుల అంకితభావంతో ఎనిమిదేళ్లుగా వందశాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారని ఇదే స్ఫూర్తితో కొనసాగిస్తామని సూచించారు.

చిగురుమామిడి: మండలంలోని నవాబుపేట్ గ్రామానికి చెందిన గూల్ల తేజస్వీని పది ఫలితాల్లో 10 జీపీఏ సాధించగా పైచదువుల నిమిత్తం ఆమెకు ఆర్థికసాయం అందిస్తానని వృక్ష ప్రదాత జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. గురువారం విద్యార్థిని ఇంటికి వెళ్లి సన్మానించారు. ఆయన వెంట పలువురు నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

తిమ్మాపూర్: మండల కేంద్రలోని శ్రీ చైతన్య పాఠశాలలోని ఏడుగురు విద్యార్థులు పదిలో 10 జీపీఏ సాధించారని ప్రిన్సిపల్ రవీందర్‌రెడ్డి తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీ విద్య డీజీఎం లక్ష్మణరావు, రీజినల్ ఇన్‌చార్జి రాజు, కోఆర్డినేటర్ ప్రవీణ్, డీన్ విజయ్ కృష్ణ, ఏవో జ్యోతిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న రవీందర్‌రెడ్డి

హైమాస్ట్ లైట్లు ప్రారంభం


హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న ఆంజనేయులు

గన్నేరువరం: మండలంలోని గునుకులకొండాపూర్ గ్రామ శివారు చొక్కాలపల్లె పెద్దమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను గురువారం ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు గూడెల్లి ఆంజనేయులు ప్రారంభించారు. పది రోజుల్లో పెద్దమ్మ తల్లి జాతర ఉన్నందున ముదిరాజ్ సంఘం నాయకుల విన్నపం మేరకు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ నిధులు మంజూరు చేయడంతో వీటిని ఏర్పాటు చేశామని తెలిపారు. ఎమ్మెల్యే, జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, ఆర్ఎస్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ గూడెల్లి తిరుపతికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు శంకర్‌గౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్ యాదగిరి, ముదిరాజ్ సంఘం కులపెద్దలు రాములు, కొండయ్య, మల్లేశం, తిరుపతి, శ్రీనివాస్, రాజలింగం, లక్ష్మయ్య, బుచ్చయ్య, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి


మాట్లాడుతున్న కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్: అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. గురువారం హుజూరాబాద్‌లోని రైతువేదికలో వ్యవసాయాధికారులతో దెబ్బతిన్న పంటలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షాలకు నియోజకవర్గంలోని కమలాపూర్, హుజూరాబాద్, జమ్మికుంట, ఇల్లంతకుంట, వీణవంక మండలాల్లోని రైతులకు అపార నష్టం జరిగిందని, నష్టపోయిన ప్రతి రైతును ఆదుకోవాలనే సంకల్పంతో వ్యవసాయ అధికారులతో సర్వే నిర్వహించామన్నారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపిన అధికారులు రైతుల వివరాలను తెలిపారు. ప్రభుత్వ ఆదేశానుసారం త్వరలోనే పంట నష్టపరిహారం అందిస్తామన్నారు. రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని సీఎం కేసీఆర్, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్‌లు అధికారులకు ఆదేశాలు జారీ చేశారని, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా ఉండడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



మానకొండూర్‌రూరల్: మండలంలోని వెల్ది ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2007-08 పదో తరగతి విద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ఈకార్యక్రమంలో గురువులు సంపత్‌కుమార్, వేణుగోపాల్, వేణుమాధవ్, కిషన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ


వాహనాలను తనిఖీ చేస్తున్న ఆర్టీఏ అధికారులు

హుజూరాబాద్: పట్టణంలోని సిర్సపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఆర్టీవో అధికారులు గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహన ధ్రువీకరణ పత్రాలు లేని, పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్తున్న వాహనదారులపై కేసులు నమోదు చేశారు. కార్యక్రమంలో హుజూరాబాద్ ఆర్టీఏ సిరాజ్ రెహమాన్, డిపో మేనేజర్ అర్పిత ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న పోలీస్ కళాబృందం

హుజూరాబాద్‌రూరల్: హుజూరాబాద్‌బాద్ మండలంలోని ధర్మరాజుపల్లి గ్రామంలో సీపీ ఎల్. సుబ్బారాయుడు ఆదేశాల మేరకు హుజూరాబాద్ టౌన్ సీఐ బొల్లం రమేష్ ఆధ్వర్యంలో పోలీస్ కళాబృందం ద్వారా సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగాసీఐ మాట్లాడుతూ.. మహిళల భద్రత, చైన్ స్నాచింగ్, షీ టీమ్స్, తల్లిదండ్రుల సంరక్షణ, ఈ చలాన్లపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుళ్లు సంపత్ రెడ్డి, బాల్ రెడ్డి పాల్గొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధికి రూ.3 కోట్లు

కరీంనగర్‌కల్చరల్: 2023–24 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ నుంచి రూ.3,18,00,000 గ్రంథాలయ అభివృద్ధికి ఖర్చు చేస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్‌కుమార్ అన్నారు. గురువారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో వివరాలు వెల్లడించారు. బిల్డింగ్ నిర్మాణం, పబ్లిక్ రీడింగ్ రూంల ఏర్పాటు, ఆన్ డిమాండ్ పుస్తకాల కొనుగోలు తదితర అంశాలపై చర్చించారు. కమిటీ ఏకగ్రీవంగా ఆమోదించిన మేరకు ఖర్చులపై వివరించిన పద్దుల ప్రకారం నిబంధనలకనుగుణంగా ఖర్చు చేస్తామని తెలివారు.

అన్ని ప్రాంతాలకు తాగునీటి సరఫరా

- కరీంనగర్ మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని అన్ని ప్రాంతాలకు తాగునీటి సరఫరా చేసేందుకు చర్యలు చేపడుతున్నామని మేయర్ సునీల్‌రావు అన్నారు. గురువారం 1వ డివిజన్ తీగలగుట్టపల్లిలో రూ.20లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైయినేజీ పనులకు, 29, 46 డివిజన్లలోని పాస్‌పోర్టు ఆఫీస్, పాతబజార్‌లో రూ.35లక్షలతో చేపట్టిన రోడ్లు, డ్రైయినేజీలకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. మొదటి ప్రాధాన్యతగా నగర ప్రజలకు తాగునీరు అందించాలనే సంకల్పంతో పైపులైన్ పనులు పూర్తి చేస్తున్నామని అన్నారు. స్టార్ హాస్పటల్స్ నుంచి రైల్వే ట్రాక్ కాలనీలన్నిటికీ రెండు రోజుల్లో నీటి సరఫరా చేస్తామని తెలిపారు. 2వ డివిజన్ విద్యారణ్యపురికాలనీలో కూడా ఈనెలాఖరులోగా తాగునీటి సరఫరా చేస్తామన్నారు. ఆరెపల్లి నుంచి సీతారాంపూర్‌కు నూతనంగా తాగునీటి పైపులైన్ వేశామని, ట్రయల్ రన్ చేసి తాగునీరు అందిస్తామని తెలిపారు. గతంలో వర్షపు నీటితో ఇండ్లు మునిగిపోతున్నాయని కార్పొరేటర్లు తెలపడంతో బొమ్మ వెంకన్న భవనం నుంచి పెద్ద డ్రైయినేజీ నిర్మాణం కూడా పూర్తి చేశామన్నారు. సరస్వతీ శిశుమందిర్ చౌరస్తా, పాస్‌పోర్టు ఆఫీస్ చౌరస్తాలో స్థల అనుకూలతను బట్టి జంక్షన్‌లను అభివృద్ధి చేస్తామని, టవర్‌సర్కిల్ ఆధునికీకరణ పనులన్నీ దాదాపుగా చివరి దశకు చేరాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కొలగాని శ్రీనివాస్, వంగల శ్రీదేవి పవన్, గుగ్గిళ్లపు మంజుల రమేశ్, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, ఆయా డివిజన్ ప్రజలు పాల్గొన్నారు. నగరంలోని ప్రతీ వీధిలో ఎల్ఈడీ లైట్లు, చౌరస్తాలో హైమాస్ట్ లైట్లు అమరుస్తున్నామని మేయర్ సునీల్‌రావు అన్నారు. 25వ డివిజన్‌లో రూ.3 లక్షలతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను గురువారం రాత్రి ప్రారంభించారు. 60 డివిజన్‌లలో ఇప్పటివరకు 550కు పైగా హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశామన్నారు. మరో 250 సెట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్పొరేటర్ ఎడ్ల సరిత అశోక్, అధికారులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనులకు భూమిపూజ

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని 11వ డివిజన్ పాత గ్యాస్‌గోదాం ప్రాంతంలో నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పైపులైన్ పనులకు కార్పొరేటర్ ఆకుల నర్మద నర్సన్న గురువారం భూమిపూజ చేశారు.

'అహంకార మాటలతో బీఆర్ఎస్ పతనం'

విద్యానగర్(కరీంనగర్): బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అహంకారపూరిత మాటలతో ఆ పార్టీ పతనం ప్రారంభం కాబో తుందని ప్రజా మిత్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. గురువారం ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీని ప ట్టుకొని ఒక టూరిస్ట్‌లా వచ్చిపోయిందని ఎగతాళి చేసి మాట్లాడటం అహంకార ధోరణికి నిదర్శనమన్నారు. తెలంగాణ వచ్చిన తొమ్మిదేళ్లలో ఏం అభివృద్ధి సాధించారో తేల్చాలన్నా రు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవడంలో ఘోరంగా వైఫల్యం చెందిందని తెలిపారు. అకాల వర్షాలతో న ష్టపోయిన రైతులకు కేసీఆర్ ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదన్నారు. ప్రతి గింజను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని తెలిపారు. స మావేశంలో నాయకులు చంద్రయ్య, ప్రసాద్, బీసీ విద్యార్థి సంఘం నాయకులు అజయ్, ప్రసాద్, రియాజ్ పాల్గొన్నారు.

గోపాల్‌రావుపేటలో పోచమ్మ బోనాలు


నెత్తిన బోనాలతో ఊరేగింపు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేటలో గురువారం కుర్మ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప పట్నాల కార్యక్రమంలో భాగంగా పోచమ్మ బోనాలు వైభవంగా నిర్వహించారు. ఇంటింటి నుంచి నెత్తిన బోనాలతో వీధుల గుండా ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆధ్యాత్మికం

వెలిచాలలో హనుమాన్ స్వాములకు అన్నదానం..

మండలంలోని వెలిచాల శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో సర్పంచ్ వీర్ల సరోజనప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో గురువారం హనుమాన్ స్వాములకు అన్నదానం నిర్వహించారు. ఈసందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పూదరి వెంకటేష్, శ్రీ కృష్ణ, తిరుపతి పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని కన్నాపూర్ వాలీసుగ్రీవ ఆలయంలో గురువారం సీతారామ, లక్ష్మణ, హనుమ పంచలోహమూర్తులకు జలాదివాసం చేశారు. పంచామృతాభిషకం, ఫల, పుష్పాభిషేకం, ధాన్యాదివాసం, తదితర పూజాకార్యక్రమాలు వేదపండితులు మధుసూదనాచార్యులు, మురళీదారాచార్యులు నిర్వహించారు. కార్యక్రమంలో హనుమాన్ మాలధారణ భక్తులు పాల్గొన్నారు.


గద్దపాకలో హిందూ ఏక్తాయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

హిందూ ఏక్తాయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

మండలంలోని గద్దపాక గ్రామంలో గురువారం రాత్రి హిందూ ఏక్తాయాత్ర పోస్టర్‌ను బీజేపీ నాయకులు, హనుమాన్ మాలధారణ భ క్తులు ఆవిష్కరించారు. ఏక్తాయాత్రను విజయవంతం చేయాలని కోరారు.